ధనుర్మాస పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్‌ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామికి అభిషేకం నిర్వహించారు. అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ధనుర్మాసంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మూసాపేట: హుడా ట్రక్‌ పార్కు సబ్‌ స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్‌ ఏఈ భీమలింగప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వివేక్‌నగర్‌ మెయిన్‌ రోడ్డు, కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌, శివాలయం, వివేక్‌ నగర్‌ రోడ్డు నెంబర్‌ 1, 2, 3, ఒమ్ని ఆసుపత్రి, బాలాజీనగర్‌ దర్గా ప్రాంతంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెన్నై సిల్క్స్‌, డిమార్టు, వివేక్‌నగర్‌ మెయిన్‌రోడ్డు, రాఘవేంద్ర కాలనీ, హబీబ్‌నగర్‌, హిమామి అపార్టుమెంట్‌, ఆంజనేయ నగర్‌, శక్తి నగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మురుగన్‌ కావడి పూజలు



మూసాపేట: మూసాపేటలో శుక్రవారం మురుగన్‌ కావడి పూజలు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయం నుంచి భరత్‌నగర్‌ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయం వరకు అయ్యప్ప భక్తులు కేరళ వాయిద్యాలతో కావడి మోశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పూజ



మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీ శ్రీ సాయి అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మండల పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫతేనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సుదర్శన్‌ రెడ్డి, బాలు, నరేందర్‌ పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని శంషీగూడ నివాసి మంజులకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పట్వారి శశిధర్‌, వెంకన్న, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూజలు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ ప్రధాన రోడ్డులోని పర్వత వర్ధిని శివాలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా శని పూజ, నవగ్రహ పూజ నిర్వహించనున్నారు. సాయంత్రం శని, కుజ దోషం, సర్ప దోష నివారణకు నవగ్రహ హోమంలో పాల్గొనాలని ఆలయ అర్చకులు అవినాష్‌శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా కోశాధికారి శ్రీనివాస్‌

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్‌, కూకట్‌పల్లి అధ్యక్షుడు విఠల్‌ గౌడ్‌, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు మస్తాన్‌ వలి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మహాసభలు జరుగనున్నాయన్నారు. మహా సభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో లోతైన చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో హాజరై మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అధునాతన విద్యా విధానం అవసరం

మాదాపూర్‌: దేశంలో 2040 సంవత్సరంకల్లా నిరక్షరాస్యతను పూర్తిగా రూపుమాపడంతోపాటు అధునాతన విద్యా విధానాలను విద్యార్థులకు అందించాలంటే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ సెక్రటేరియట్‌ ట్రైనింగ్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ (ఐఎస్‌టీఎం) జాయింట్‌ డైరెక్టర్‌ గుంజన్‌ గాంధీ తెలిపారు. మాదాపూర్‌లోని మెరీడియన్‌ స్కూల్‌లో నగరంలోని సీబీఎస్‌ఈ 83 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తా చెదారం

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు



శాతవాహన నగర్‌లోని పార్కు వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం



శాతవాహననగర్‌ ప్రధాన రహదారిలో ..



ఎల్లమ్మ చెరువు వద్ద ..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్‌ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్తా చెదారం పేరుకుపోయి వీధులన్నీ చెత్త కుప్పలతో దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌ కాలనీ, జలవాయు విహార్‌, ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌, ఆల్విన్‌ కాలనీ పైపులైన్‌ రోడ్డు, ఎల్లమ్మ చెరువు ప్రాంతాల్లో తదితర కాలనీల్లోని వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయి మూగజీవాలకు, దోమలకు ఆవాసాలుగా మారాయి. రహదారులపై వెళ్లాలంటే ముక్కు మూసుకొని ప్రయాణించాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చూస్తున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్తను తరలించకపోవడంతో రోజుల కొద్దీ అక్కడే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చెత్తా చెదారాన్ని తరలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మన్మోహన్‌ సింగ్‌ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌ తదితరులు



మూసాపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు, స్థానికులు



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, సూరజ్‌ తివారి తదితరులు



పూలమాలేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్‌ వివేకానందనగర్‌ డివిజన్‌ అధ్యక్షులు బాషిపాక యాదగిరి తదితరులు

మన్మోహన్‌ సింగ్‌ మృతి తీరనిలోటు

మాజీ ప్రధానికి ఘన నివాళి

ఆయన సేవలను స్మరించుకున్న నేతలు

మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్‌ సింగ్‌ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలు పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. శుక్రవారం పలు కూడళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మన్మోహన్‌సింగ్‌ ప్రధానిగా, ఆర్థికమంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారుగా పలు బాధ్యతలు నిర్వహించారన్నారు. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ప్రధానుల్లో ఆయన ఒకరని కొనియాడారు. దేశ ఆర్థిక చరిత్రనే మలుపు తిప్పిన నాయకుడని, చారిత్రాత్మకమైన ఎన్నో పథకాలు మన్మోహన్‌సింగ్‌ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని గుర్తు చేసుకున్నారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలకు భారత ప్రభుత్వం ఆయనకు పద్మ విభూషణ్‌ పురస్కారంతో సత్కరించిందన్నారు.

– కూకట్‌పల్లి జోన్‌ బృందం



నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఏ బ్లాక్‌ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌ రెడ్డి తదితరులు



నివాళులర్పిస్తున్న పాపిరెడ్డి నగర్‌ కాలనీ వాసులు



నివాళి అర్పిస్తున్న శేరి సతీష్‌ రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు



కేపీహెచ్‌బీ టెంపుల్‌ బస్టాప్‌ వద్ద టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ తదితరులు

ప్రజారోగ్యంతో చెలగాటం

- హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహారం
- అధికారుల పర్యవేక్షణ లోపం
- మాంసం క్రయవిక్రయాల్లో అపరిశుభ్రత



సాక్షి, సిటీబ్యూరో: ఆకర్షణీయమైన ప్యాకింగ్‌, ఘుమఘుమలాడే వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు. బయట హోటళ్లు, తోపుడు బండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ముప్పు పొంచి ఉంది. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, పలు పంచాయతీల్లోని చాలా హోటళ్లు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఆహార భద్రత టాస్క్‌ ఫోర్స్‌ బృందం ఇటీవల నగరంలో పలు హోటళ్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలించగా.. ఇవన్నీ తేటతెల్లం అయ్యాయి.

నిబంధనలు గాలికి

ఆహార వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఇబ్బడిముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్‌ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్‌ సేఫ్టీ అండ్‌ స్టాండర్డ్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) ప్రమాణాలను పాటిస్తూ, శుభ్రతతోపాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలకు గాలికి వదిలేస్తున్నారు. చెడిపోయిన, కుళ్లిపోయిన పదార్థాలు, బూజుపట్టిన కూరగాయలు, రోజులకొద్దీ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు, కాలం చెల్లిన మసాలాలు, నిత్యావసరాలు, నాసిరకం పిండి, వాడిన నూనెలు మళ్లీ వాడటం, కృత్రిమ రంగులు వినియోగించడం వంటివి చేస్తున్నారు. హైదరాబాద్‌–వరంగల్‌ జాతీయ రహదారి, రాజీవ్‌ రహదారితోపాటు హైదరాబాద్‌–నిజామాబాద్‌ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్లు, టీ కొట్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినప్పటికీ నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు.

ఆకట్టుకునేందుకు రంగులు

వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను కూడా వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలకు, ఫాస్ట్‌ఫుడ్‌ కేంద్రాల్లో చికెన్‌ మంచూరియా, వెజ్‌ మంచూరియ తయారీలో ఎరుపు రంగు వాడుతున్నారు. మిగిలిన వాటిని ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారు. మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించటం లేదు.

పర్యవేక్షణ లోపం

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండటంతోపాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్‌ ఆఫీసర్లు లేకపోవటంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలలోని పదార్థాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో తినుబండారాల తయారీతోపాటు హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న మల్లారెడ్డి, కాంతారావు, నాయకులు

–పార్టీ జిల్లా కన్వీనర్‌ మల్లారెడ్డి

కూకట్‌పల్లి: బూత్‌ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా కన్వీనర్‌ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ బూత్‌ కమిటీల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన సభ్యత్వ నమోదు, పోలింగ్‌ బూత్‌ కేంద్రాలకు సంబంధించిన బూత్‌ అధ్యక్షులు, వారి పూర్తి కమిటీల నియామక వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పార్టీ పట్ల సానుకూలత ఉందన్నారు. ప్రజల్లో ఉంటూ పని చేయాలన్నారు. అనంతరం బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. సామాన్యులు సైతం పార్టీ సభ్యత్వాలు తీసుకోవటం పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. ఇప్పటి వరకు 50 వేల పై చిలుకు సభ్యత్వాలను పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, సీనియర్‌ నాయకులు శ్రీధర్‌రావు, భగవంత్‌ రెడ్డి, సోమశేఖర్‌ రెడ్డి, రాము, గోపి, అనిల్‌, సంతోష్‌, శేఖర్‌, సూరిబాబు, ప్రేమ్‌ కుమార్‌, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ బిల్లు వసూలుకెళ్లిన బిల్‌కలెక్టర్‌పై దాడి

–ఇద్దరిపై కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: విద్యుత్‌ పెండింగ్‌ బిల్‌ చెల్లించాలని వెళ్లిన బిల్‌ కలెక్టర్‌పై దాడి చేసిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చార్మినార్‌కు చెందిన బండారు శ్యామ్‌ (39) కేపీహెచ్‌బీ కాలనీలోని విద్యుత్‌ శాఖలో లైన్‌మెన్‌, బిల్‌ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఈడబ్ల్యూఎస్‌ గృహాల్లోని ప్లాట్‌ నెంబర్‌ 109 వద్దకెళ్లి పెండింగ్‌ బిల్లు చెల్లించాలని కోరగా ఇంట్లో నుంచి వచ్చిన రంజాన్‌, హుస్సేన్‌ అన్నాదమ్ములు శ్యామ్‌ను దూషిస్తూ అతడి ద్విచక్ర వాహనాన్ని కిందపడేసి చెంపపై కొట్టారు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!

మోతీనగర్‌: విద్యుత్‌ ఫ్యూజ్‌ బాక్స్‌కు మూత లేకపోవటంతో ప్రమాదం పొంచి ఉన్నది. అల్లాపూర్‌ సెక్టార్‌ గాయత్రినగర్‌ సున్నం చెరువు పార్కు లోపల, బయట పిల్లలు ఆడుకోవడానికి వస్తుంటారు. సాధారణ రోజుల్లో కూడా సాయంత్రం వేళల్లో పార్కు సమీపంలో నివసించే పిల్లలు ఆడుకోవటానికి, వయోవృద్ధులు కాలక్షేపం కోసం వస్తుంటారు. ఫ్యూజ్‌ బాక్స్‌ పక్క నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఏ మాత్రం ఆదమరిచినా విద్యుత్‌ ప్రమాదానికి గురికావటం ఖాయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫ్యూజ్‌ బాక్స్‌కు శాశ్వతంగా మూతను ఏర్పాటు చేయాలని పలువురు వాకర్స్‌ కోరుతున్నారు.



ఫ్యూజ్‌ బాక్స్‌ వద్ద ఆడుకుంటున్న బాలుడు

చెరువుల అభివృద్ధికి కృషి

మియాపూర్‌: నియోజకవర్గంలోని అన్ని చెరువులను అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గురునాథం చెరువు సుందరీకరణ పనులను ఆయన కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునాథం చెరువు సుందరీకరణంలో భాగంగా నెక్సెస్‌ సెలెక్ట్‌ మాల్‌ కంపెనీ వారి సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా మల్లిగావాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చెరువు అభివృద్ధి పనులను చేపడుతున్నారని అన్నారు. చెరువు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గురునాథం చుట్టుపక్కల ప్రాంతవాసుల ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరనుందని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. చెరువును అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లిగావాడ్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు, ఐటీ సంస్థ ప్రతినిదులు రామ్‌ బొట్లా, చైతన్య తదితరులున్నారు.

బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి అదృశ్యం



మూసాపేట: బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్‌ రామాయిగూడెంకు చెందిన ఈ. చిన్న (35) కూకట్‌పల్లి భాగ్యనగర్‌ కాలనీలోని బంధువుల ఇంటికి మూడు రోజుల క్రితం వచ్చాడు. ఈ నెల 24న రాత్రి 11.48 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సొంత ఊరికి వెళ్లకపోవటంతో ఆందోళనకు గురైన బంధువులు ఎంత వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.